





సందులో సడేమియా..సంక్రాంతికి 'హాంఫట్'

- పంజా విసురుతున్న 'పాడి దొంగలు'
- రెక్కీ వేసి ఎత్తుకెళ్తున్న వైనం
- లబోదిబో మంటున్న పాడి రైతులు
- పట్టీపట్టనట్లు పోలీసుల ధోరణి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

జేబుదొంగలు.. ముసుగు దొంగలు.. ఏటీఎం దొంగలు లాంటి పేర్లు విన్నాం కానీ.. ఈ పాడి దొంగలేంటని అనుకుంటున్నారా..? మీరు విన్నది నిజమేనండి..!! పల్లెల్లో పాడి దొంగల ప్రాబల్యం ఇటీవల అధికంగా ఉంది. పక్కాగా రెక్కీ వేసి మరీ దొంగల ముఠా పాడి సంపదను ఎత్తుకెళ్తున్నారు. రాత్రి మందలో ఉండే గొర్రెపోతు, మేకపోతు తెల్లారే సరికి కనిపించకపోతుండటంతో పాడి రైతులు లబోదిబోమంటున్నారు. దొంగల ముఠా రాత్రికి రాత్రే గొర్రెలు, మేకల మందలతో పాటు పాలిచ్చే విలువైన ఆవులు, గేదెలను సైతం ఎత్తుకెళ్లిపోతుండటం గమనార్హం. ఇటీవల తూర్పు మండలాల్లో పాడి దొంగల పంజా దెబ్బకు విలవిల్లాడిన కొందరు పాడి రైతులు ఆయా పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేసినా పోలీసులు లైట్ తీసుకున్నారన్న విమర్శలున్నాయి.

రోడ్డు పక్క మందల పైనే గురి!

" శతకోటి దరిద్రాలకు అనంత కోటి ఉపాయాలన్న" చందంగా దొంగలు ఈజీ మనీ కోసం కొత్త కొత్త దార్లను అన్వేషిస్తున్నారు. మార్కెట్లో గొర్రెపోతు, మేకపోతులతోపాటు బాగా పాలిచ్చే ఆవులకు, గేదెలకు మంచి డిమాండ్ ఉంది. తూర్పు మండలాలు పూర్తిగా వ్యవసాయ ఆధారిత మండలాలు కావడంతో ఇక్కడ అదే స్థాయిలో పాడి పరిశ్రమ అభివద్ధి చెంది ఉంది. ఈ క్రమంలో దొంగల ముఠా పగటిపూట పల్లెల్లో రెక్కీ వేసి రాత్రిళ్ళు ఒక్కసారిగా మందలపై పడి వాహనాల్లో ఎక్కించి పొరుగు రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పాడి సంపదను ఎత్తుకెళ్లడంలో అంతర్రాష్ట్ర దొంగల ముఠా హస్తమున్నట్లు జనాలు చర్చించుకుంటున్నారు. ముఖ్యంగా ఆ ముఠా పల్లెల్లో రోడ్డు పక్కన ఉండే గొర్రె, మేకల మందలను లక్ష్యంగా చేసుకొని దోపిడీకి పాల్పడుతున్నారని జనాలు చెబుతున్నారు. పాడి రైతులు మందలను వదిలి గాఢ నిద్రలో ఉన్న సమయంలో ముఠా ఒక్క ఉదుటున వాహనాల్లో వచ్చి మందలో చేతికి దొరికినన్నింటిని అపహరించుకొని పోతున్నారని జనాలు వాపోతున్నారు. ముఖ్యంగా తొట్టంబేడు మండలంలోని బోనపల్లి, కారాకొల్లు, చిట్టత్తూరు, కొత్తకండ్రిగ, తుమ్మలగుంట తదితర గ్రామాల్లో అధికంగా ఈ తరహా దొంగతనాలు జరిగాయని పాడి రైతులు వాపోతున్నారు.

స్థానిక దొంగలు హల్ చల్

ఓ పక్క అంతరాష్ట్ర దొంగలు పాడి సంపదను దోచుకెళ్తున్న తరుణంలో 'సందులో సడేమియా' అన్నట్లు స్థానిక దొంగలు కూడా అదును చూసి రెచ్చిపోతున్నారు. ముఖ్యంగా స్థానిక దొంగలు పాడి రైతుల దగ్గర ఉన్న బలమైన పొట్టేళ్లు, మేకపోతులు, ఆవులు, గేదెలు, మేలు రకం జాతి కోళ్లను ఎత్తుకెళ్లిపోయి ఆ నేరాన్ని అంతర్రాష్ట్ర దొంగల ముఠా పై వేసేస్తున్నారు. ముఖ్యంగా ఈ తరహా దొంగతనాలు పల్లెల్లో సంక్రాంతి పర్వదినం సందర్భంగా అధికంగా చోటుచేసుకున్నాయి. ఎంత కాదన్నా పొట్టేలు, మేక పోతు ధర రూ.20 నుంచి రూ.25 వేలు ఉంటుంది. మేలు రకం జాతి ఆవు, గేదె ధర రూ.60 నుంచి రూ.80 వేల వరకు ఉంటుంది. అదేవిధంగా మేలురకం కోడి పుంజు ధర రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు ఉంటుంది. ఈ క్రమంలో ఈజీ మనీ కోసం అలవాటు పడ్డ అంతర్రాష్ట్ర దొంగల ముఠాతో పాటు స్థానిక దొంగలు పాడి సంపద లక్ష్యంగా దోపిడీలకు పాల్పడుతున్నారు. పశుసంపదపైనే ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్న పాడి రైతులు దొంగల దెబ్బకు బతుకు జీవుడా అనుకుంటున్నారు. ఇప్పటికైనా పోలీస్ యంత్రాంగం నిద్ర మేల్కొని పల్లెల్లో రాత్రిపూట గస్తీ నిర్వహించి విలువైన పాడి సంపద దొంగల పాలు కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సంక్రాంతి సాంస్కృతిక కళా సోయగం

రోజా ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో..

నగరిలో మంత్రి రోజా, నటుడు ఆలీ సందడి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

సంక్రాంతి కొండచుట్టూ ఉత్సవం సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో సంక్రాంతి సాంస్కృతిక కళా సోయగం, ముగ్గుల పోటీలు అలరించాయి. రోజా చారిటబుల్ ట్రస్టు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక వ్యవహారాల, యువజన సర్వీసుల క్రీడాశాఖ మంత్రి ఆర్‌కె రోజా, సినీనటులు, రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా అడ్వైజర్ ఆలీ విచ్చేశారు. తెలుగువారి సాంప్రదాయంగా ఎద్దుల బండిలో రోజా, ఆలీ సభా వేదిక వద్దకు చేరుకున్నారు.

నగరి నియోజకవర్గంలోని మహిళలు వేసిన కనులవిందైన రంగురంగుల రంగవల్లులను మంత్రి సందర్శించారు. డిగ్రీ కళాశాల క్రీడా మైదానం నిండుగా చెరకు గెడల అలంకరణతో, సాంప్రదాయ దుస్తులతో, గంగిరెద్దుల సవ్వడితో, కోడిపందేల జోరుతో పండుగ జోష్ కనిపించింది. మంత్రి రోజా మహిళలకు మట్టిగాజులు వేసి, మెహందీ పెట్టి పండుగ వాతావరణాన్ని మరింత శోభాయమానం చేశారు. సంక్రాంతి సందర్భంగా పొంగళు పెట్టారు. అనంతరం చిలకజోస్యం స్టాల్‌ను సందర్శించారు. చిన్నారుల కోలాటాలు, భరతనాట్యం ప్రదర్శనలు, హరికథా ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. మంత్రి రోజా తన అత్త షణ్ముగం పుట్టినరోజు పురస్కరించుకుని సభావేదికపై కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆలీ తన చిన్నతనంలో తనకు వచ్చిన మొదటి బహుమతి లైఫ్‌బాయ్ సోప్ గురించి చెప్పి అందరినీ ఛలోక్తులతో నవ్వించారు. మంత్రి రోజా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు ఏమి కావాలో పాదయాత్రల్లో తెలుసుకుని అన్నీ ఇస్తున్నారని, నగరి కొండచుట్టూ మహోత్సవంలో 21 మంది దేవుళ్లు చక్కని అలంకరణతో ఆశీర్వదిస్తారని తెలిపారు. 2004 నుంచి ఈ



ఉత్సవానికి హాజరవుతున్నానని గుర్తు చేశారు. భవాని ఐలాండ్‌లో జనవరి 11 నుంచి 16వ తేదీ వరకు ఆరు రోజుల పాటు గ్రామీణ వాతావరణం సృష్టించగా ప్రజలు తమ కుటుంబాలతో సంతోషంగా గడిపారన్నారు.

విజేతలకు బహుమతులు

నగరికి చెందిన విజయకుమారి ప్రథమ బహుమతిగా ఫ్రిజ్‌ను అందుకున్నారు. రెండో బహుమతి పుదిపేటకు చెందిన తేన్మోలి, భవ్య వాషింగ్ మిషన్ అందుకున్నారు. తృతీయ బహుమతి గుడ్డికండ్రిగకు చెందిన దివ్య, లక్ష్మమ్మలు ఎల్ఇడి టివి తీసుకున్నారు. కన్సొలేషన్ బహుమతులుగా ఫెడల్ ఫ్యానులను పుత్తూరుకు చెందిన వాణి, వందన, నగరికి చెందిన లత, సౌమ్య, వికెఆర్ పురానికి చెందిన విజయకుమారి, శాంతి, పుత్తూరుకు చెందిన ముత్తులక్ష్మి, నాగేశ్వరి, పుష్పాంజలి, జమున, చిన్నతంగల్‌కు చెందిన యమున, చందనకుమారి, చింతలపట్టెడకు చెందిన లక్ష్మి, సరస్వతి, నగరికి చెందిన గ్రేస్, సుజాత, గుండ్రజుకుప్పంకు చెందిన పార్వతి, చాందిని, లోకేశ్వరి, షాలిని సాధించారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ డైరెక్టర్ వెంగమ్మ, తుడ సెక్రటరీ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.



సీనియర్ జర్నలిస్టు శశిధర్ మృతిపై...

జ్యుడీషియల్ విచారణ జరపాలి: సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

సీనియర్ పాత్రికేయుడు శశిధర్ మరణం పై నెలకొన్న అనుమానాలను తీర్చడానికై జ్యుడీషియల్ ఎంక్వైరీ జరపాలని సిపిఎం జిల్లా నేత కందారపు మురళి డిమాండ్ చేశారు. మంగళవారం ఉదయం తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో జరిగిన మెజిస్ట్రీరియల్ విచారణలో కందారపు మురళి పాల్గొన్నారు. శశిధర్ మృతి పై ఉన్న అనుమానాల పై తిరుపతి జర్నలిస్టులు, వివిధ రాజకీయ పక్షాలు విచారణ జరపాలని డిమాండ్ చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో మంగళవారం మెజిస్ట్రీరియల్ విచారణ ఆర్డీఓ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా కందారపు మురళి మాట్లాడుతూ శశిధర్‌కు ఎలాంటి నేరచరిత్ర లేదని గుర్తు చేశారు. కేవలం పోలీసుల అక్రమాలను లోకానికి వెల్లడి చేస్తున్నారన్న కారణంతో, కొందరు పనిగట్టుకుని కుట్రపూరితంగా కేసులో ఇరికించారని, తప్పుడు కేసులో ఉన్న కారణంగా మానసిక క్షోభకు గురై తిండి మానేసి, అప్పటికే తీవ్ర అనారోగ్యంతో ఉన్న శశిధర్ మృత్యువును కొని తెచ్చుకున్నారని కందారపు మురళి ఆరోపించారు. జరిగిన ఘటనలో శశిధర్ తప్పేమీ లేకపోయినా అక్రమంగా కేసులు బనాయించడంపై సమగ్ర విచారణ జరపాలని, దానికి మెజిస్ట్రీరియల్ విచారణ సరిపోదని జ్యుడీషియల్ విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు, కాంగ్రెస్ పార్టీ నేత మాంగాటి గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి విద్యుత్ ఛార్జీలపై ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

విద్యుత్తు ఛార్జీల ప్రతిపాదనలపై ఈనెల 19 నుంచి ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు నియంత్రణా మండలి (ఏపీఈఆర్సీ) వర్చువల్ పద్ధతిలో నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ సీ.వీ నాగార్జునరెడ్డి తెలిపారు. ఎస్పీడీసీఎల్, సీపీడీసీఎల్, ఈపీడీసీఎల్ మూడు విద్యుత్తు పంపిణీ సంస్థలకు సంబంధించిన అధికారులు విశాఖపట్నం నుంచే పాల్గొంటారన్నారు. ఏపీఈఆర్సీ ఆధ్వర్యంలో మంగళవారం నమూనా ప్రజాభిప్రాయ సేకరణ (మాక్ డ్రిల్) కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 19 నుంచి మూడు రోజుల పాటు జరగనున్న ప్రజాభిప్రాయ సేకరణలో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డిస్కమ్ ల సిఎండిలకు సూచించారు. ఎక్కువ మంది వినియోగదారులు పాల్గొనేలా విద్యుత్తు సిబ్బందితో ప్రచారం చేయాలన్నారు. సర్కిల్, డివిజన్ కార్యాలయాల నుంచి వినియోగదారులు/ అభ్యంతరదారులు తమ సలహాలు/ సూచనలు/ అభ్యంతరాలు వ్యక్తం చేసేందుకు వీలుగా తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. గత రెండేళ్ల తరహాలోనే ఈ ఏడాది కూడా రాష్ట్రవ్యాప్తంగా ఆయా జిల్లాలోని సమీప విద్యుత్ ఆపరేషన్ సర్కిల్ కార్యాలయం(ఎస్ఈ ఆఫీస్) లేదా డివిజన్ కార్యాలయాల (ఈఈ ఆఫీస్) నుంచి ఎక్కడి నుంచైనా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తమ అభిప్రాయాలను తెలపొచ్చని సూచించారు.

'ఆత్మనిర్భర్ భారత్'ను బలోపేతం చేయాలి

ప్రజాశక్తి - వరదయ్యపాళెం

ఆత్మనిర్భర్ భారత్ పథకం బలోపేతం కోసం వినూత్న పద్ధతుల ద్వారా తయారీ రంగాన్ని మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని కేంద్ర రక్షణ శాఖ శాస్త్రీయ సలహాదారు డాక్టర్ జి.సతీష్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన శ్రీసిటీలో పర్యటించి స్థానిక పరిశ్రమల సీనియర్ మేనేజర్లతో సమావేశమయ్యారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికి పరిశ్రమల ప్రతినిధులకు పరిచయం చేశారు. 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్య సాధనలో తమ సత్తా చాటేందుకు పరిశ్రమలకు ఇది సరైన అవకాశంగా తాను భావిస్తున్నానని అన్నారు.

సమావేశంలో 'వినూత్న తయారీ - ఆత్మనిర్భర్ భారత్' అంశంపై ప్రసంగించిన డాక్టర్ సతీష్ రెడ్డి వినూత్నత్వానికి పెద్దపీట వేస్తున్న భారత ప్రభుత్వం, రక్షణ శాఖతో సహా అనేక రంగాలలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మనిర్భర్ భారత్' పథకాల ద్వారా చురుకైన విధానాలతో స్వదేశీ సాంకేతిక అభివద్ధిని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. 'మేక్ ఇన్ ఇండియా', 'స్టార్ట్-అప్ ఇండియా', 'ఆత్మనిర్భర్ భారత్' వంటి ప్రభుత్వ విధానాల ఫలితంగా అనేక కొత్త అవకాశాలు ఉద్భవిస్తాయని చెప్పారు. శ్రీసిటీలో జరుగుతున్న వేగవంతమైన పారిశ్రామిక పురోగతిని అభినందించారు. కొన్ని పరిశ్రమలు దిగుమతులకు ప్రత్యామ్నాయంగా ఉత్పత్తులు చేపట్టడంతో పాటు, గణనీయంగా ఎగుమతులు కూడా చేస్తూ 'మేక్ ఇన్ ఇండియా' ప్రచారాన్ని ప్రోత్సహించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

పర్యటనలో భాగంగా శ్రీసిటీ పరిసరాలు చుట్టిచూసిన డాక్టర్ సతీష్ రెడ్డి బ్యూరోలెక్స్ పరిశ్రమను సందర్శించి, ఉత్పత్తుల తీరును పరిశీలించారు.

శ్రీసిటీలో కేంద్ర రక్షణమంత్రి సలహాదారు సతీష్‌రెడ్డి



26న ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి జిల్లాలో మొదటిసారిగా 74వ గణతంత్ర వేడుకలను స్థానిక పోలీస్ పెరేడ్ మైదానంలో అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ లో 74వ గణతంత్ర వేడుకల నిర్వహణపై జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరం ఆగష్టు 15 న స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించామని, అదే స్ఫూర్తితో రిపబ్లిక్ డే వేడుకలు నిర్వహించాలని అన్నారు. రిపబ్లిక్ డే దినోత్సవంలో జిల్లా అభివద్ధి పై ప్రసంగ పాఠం నిమిత్తం వివిధశాఖలలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, సాధించిన అభివద్ధిపై నివేదికలు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయానికి వెంటనే అందించాలని అన్నారు. విద్య , వైద్యం, రీసర్వే, హౌసింగ్ , ప్రజాపంపిణీ , సచివాలయాలు , మహిళా సాధికారత వంటి వాటిపై ఎగ్జిబిషన్ స్టాల్స్, శకటాల ఏర్పాటు చూడాలని అన్నారు. విద్యార్థులచే సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహణ జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.వి.మ్యూజిక్ అండ్ డ్యాన్స్ కళాశాల సంయుక్తంగా నిర్వహించేలా చూడాలని అన్నారు. పోలీస్ యంత్రాంగం పెరేడ్ గ్రౌండ్ నందు ఏర్పాట్లు నగరపాలక సంస్థ , రెవెన్యూ , తుడా సహకారం వుంటుందని సూచించారు. జిల్లా అధికారులు తమశాఖ విధుల్లో ప్రతిభ కనబరిచిన అధికారులకు , సిబ్బందికి ప్రశంసా పత్రాల జాబితా కలెక్టరేట్ కు పంపాలని సూచించారు. ఈ సమీక్షలో నగరపాలక కమిషనర్ అనుపమ అంజలి , జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, ఆర్డీఓలు కనకనరసా రెడ్డి, కిరణ్ కుమార్ , తుడా సెక్రటరీ లక్ష్మి , ఎఒ జయరాములు పాల్గొన్నారు.

హైరిస్క్ ప్రసవాలకు

మెడికల్ ఆఫీసర్లదే బాధ్యత : కలెక్టర్

జిల్లాలో హై రిస్క్ గర్భవతుల ప్రసవ భాధ్యతతో పాటు రవాణా ఎర్పాటు పి హెచ్. సి. మెడికల్ ఆఫసర్లు చూడాలని, 108 అందుబాటులోకి రాకపోతే ప్రవేట్ వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని, ఇందుకోసం రూ.10 వేలు వంతున పి హెచ్ సి లకు కేటాయించామని కలెక్టర్ కె. వెంకటరమణా రెడ్డి ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్ నుండి జిల్లాలోని డివిజన్, మండల స్థాయి అధికారులతో కో - ఆర్డినేషన్ సమావేశం జరిగింది. కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ హై రిస్క్ గర్భవతుల పై మెడికల్ ఆఫీసర్‌లు



ప్రత్యేక దష్టి పెట్టాలని, మాత శిశు మరణాలు అనేది జిల్లాలో ఒక్కటీ జరగరాదని తెలిపారు. సి. డి., ఎన్. సి. డి. సర్వే తరచూ నిర్వహించాలని, ఏ ఎన్ ఎం లు కనీసం 10 ఐ డి లకు తక్కువ కాకుండా సర్వే వుండాలని అన్నారు. అనీమియా గుర్తించిన వారి సంపూర్ణ పోషణ ఫుడ్ సరిగా అందుతున్నదా లేదా పర్యవేక్షణ వుండాలని అన్నారు. అంగన్ వాడి లో పిల్లలు బరువు, పొడవు తక్కువ , రక్తహీనత తప్పనిసరి పరీక్షలు చేసి గుర్తించి వారి బాలమతం కచ్చితంగా అందాలని అన్నారు. హిమోగ్లోబిన్ పరీక్షలు ఇంకా 120 స్కూళ్లలో జరగాలన్నారు. తమ వంతు భాధ్యతగా అధికారులు ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం పై దష్టి పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ శ్రీనివాస రావు , ఆర్డీఓ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

స్నేహబంధం... 'సంక్రాంతి' విషాదం..!

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం
- ఒకరికి తీవ్ర గాయాలు
- వేగంగా బస్సును ఢీకొన్న స్కూటర్

పజాశక్తి - చిన్నగొట్టిగల్లు

సంక్రాంతి పండుగ స్నేహితుని గ్రామానికి ముగ్గురూ కలిసి వెళ్లారు. పండగ సంతోషంగా జరుపుకున్నారు. మంగళవారం విధులకు హాజరుకావాల్సి ఉండడంతో ఒకే స్కూటర్‌లో ముగ్గురూ తిరుపతికి తిరుగు ప్రయాణమయ్యారు. అయితే వేగంగా వస్తూ బస్సును ఢీకొన్న ఘటనలో సాయి, హేమంత్ అక్కడికక్కడే మృతిచెందారు. శివకుమార్ తీవ్ర గాయాలతో తిరుపతి రుయాకు 108 ద్వారా చికిత్స నిమిత్తం తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతులు తిరుపతి సత్యనారాయణపురంలో ఉంటున్న సాయికృష్ణ (22), అతని స్నేహితుడు హేమంత్ (20)గా గుర్తించారు. హైదరాబాద్ ప్రశాంత్‌నగర్‌లో ఉంటున్న శివకుమార్ సంక్రాంతి పండుగకు సొంతూరైన నూత్నకాల్వకు వచ్చి, స్నేహితులను తన ఇంటికి రమ్మని పిలిచాడు.

శివకుమార్, సాయి, హేమంత్ ముగ్గురూ స్నేహితులు. పీలేరు సమీపంలోని నూత్నకాల్వకు హైదరబాద్ నుంచి విచ్చేసిన శివకుమార్ ఆహ్వానం మేరకు వెళ్లారు. స్నేహితుని ఇంట సంతోషంగా గడిపారు. పండగ ముగించుకుని మంగళవారం ఉదయం విధులు నిర్వర్తించేందుకు ముగ్గురూ ఒకే సైకిల్ మోటారుపై తిరుపతికి తిరుగు ప్రయాణమయ్యారు. విధులకు ఆలస్యం అవుతుందన్న ఆతృతతో వేగంగా బైక్ నడిపారు. భాకరాపేట ఘాట్‌రోడ్డులో తిరుపతి నుంచి పీలేరు వైపు వస్తున్న ఆర్టీసిని మలుపు వద్ద బలంగా ఢీకొన్నారు. ఈ ఘటనలో సాయి, హేమంత్‌లు అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన శివను 108లో తిరుపతి రుయాకు చికిత్స నిమిత్తం తరలించినట్లు భాకరాపేట సిఐ తులసీరామ్‌పేర్కొన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. స్నేహితుల మరణంలో ఆయా కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి.



పోలీసు కానిస్టేబుల్ ప్రిలిమ్స్ పరీక్షలకు ఏర్పాట్లు : ఎస్పి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

పోలీస్ రిక్రూట్మెంట్ ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు (ఏపిఎస్ ఎల్ పిఆర్ బి) ఆదివారం నిర్వహించనున్న పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమ్స్ పరీక్షలకు భద్రతా పరమైన అంశాలపై, ఏర్పాట్లను జిల్లా ఎస్పి పి. పరమేశ్వర రెడ్డి సమీక్ష నిర్వహించారు. సమీక్ష అనంతరం పరీక్షలు నిర్వహించు కేంద్రాల వద్ద



ఏర్పాట్లను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించ వలసిన నియమ నిబంధనలపై అధికారులకు పలు సూచనలు చేసారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ ఆదివారం నిర్వహించనున్న పోలీస్ రిక్రూట్మెంట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు నిబందనల ప్రకారం పూర్తి చేస్తున్నామని, ఎలాంటి ఘటనలకు తావు లేకుండా గట్టి భద్రతా చర్యలను చేపట్టడం జరిగిందన్నారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద అవసరమైన మేరకు పోలీసు సిబ్బందిని నియమించామన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు సెబ్ జాయింట్ డైరెక్టర్ రాజేంద్ర, గూడూరు డిఎస్పి సూర్యనారాయణ రెడ్డి, తిరుపతి అడిషనల్ ఎస్పి కులశేఖర్, తిరుపతి వెస్ట్ డిఎస్పి నరసప్ప , అడిషనల్ ఎస్పి విమల కుమారి, పుత్తూరు డిఎస్పి రామరాజు పాల్గొన్నారు.



ఇంటిపై జెండా నాటలేదని పలువురిపై దాడి

ప్రజాశక్తి-యర్రావారిపాలెం

మండలంలోని ఉదయమాణిక్యం పంచాయతీ సుక్రోళ్ళ గ్రామంలో తన ఇంటిపై వైసిపి జెండాలు నాటలేదని స్థానిక సర్పంచ్ కుమారుడు 60 మందితో వెళ్లి ఇండ్లపై దాడి చేశారని బాధితులు సుబ్రహ్మణ్యం, మురళి, పద్మనాభం మీడియాకు తెలిపారు. బాధితుల వివరాలు మేరకు .. సంక్రాంతి పండుగ సందర్భంగా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మండలంలోని ప్రతి ఇంటికి పండుగ కానుకగా బట్టలు పంపిణీ చేశారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ వైసీపీ జెండాను కట్టుకోవాలని, లేనిపక్షంలో కనుమ పండుగ చేయకూడదని బెదిరించడంతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొందని, పలువురికి గాయాలయ్యాయని తెలిపారు. ఈ ఉద్రిక్తతపై సిఐ, ఎస్ఐలకు ఫిర్యాదు చేశామని బాధితులు తెలిపారు. సిఐ తులసీరామ్‌ను వివరణ అడగగా రాజకీయ పార్టీలు గురించి గానీ, జెండాలు గురించి గానీ ఘర్షణ జరగలేదని, కనుమ పండుగ రోజు చిట్లాకుప్ప వేయడానికి వివాదంలో భాగంగా ఉద్రిక్తత చోటుచేసుకుందని తెలిపారు.



చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సమక్షంలో వైసిపిలోకి ..

చిన్నగొట్టిగల్లు : భాకరాపేట గ్రామ పంచాయతీ బీసీ కాలనీలోని టీడీపీ నుంచి వైసిపి లోకి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తనయుడు తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సమక్షంలో చేరారు. ఎంపీపీ యుగంధర్ రెడ్డి ,డిసిఎమ్మెస్ చైర్మన్ సహదేవ రెడ్డి మండలంలో వైసీపీ బలోపేతంలో భాగంగా చేరికలకు కృషి చేస్తున్నారు.ముమ్ముందు మరిన్ని చేరికలుంటాయని చెప్పారు. జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపట్ల పలువురు ఆకర్షితులౌతున్నారన్నారు. కండువాలు కప్పి పార్టీలోకి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జట్పీటిసి స్వరూప మహేందర్ రెడ్డి, పార్టీ కన్వీనర్ కొండారెడ్డి, సర్పంచ్ భూపాల్ పాల్గొన్నారు.

కపిలతీర్థంలో సుబ్రహ్మణ్యస్వామి హోమం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

తిరుపతి కపిలేశ్వరస్వామివారి ఆలయంలో జరుగుతున్న హోమ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం సుబ్రహ్మణ్యస్వామివారి హోమం ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా యాగశాలలో ఉదయం 8.30 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పుణ్యాహవాచనం, కలశ స్థాపనపూజ, సుబ్రహ్మణ్యస్వామి హోమం, పూర్ణాహుతి, నివేదన, హారతి నిర్వహించారు. 18వ తేదీ శ్రీ దుర్గా, లక్ష్మీ, సరస్వతి అమ్మవార్ల హోమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో పార్థసారథి పాల్గొన్నారు.



నిత్యాన్నదానానికి రూ.55 వేలు విరాళం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తీశ్వరాలయ నిత్యాన్నదాన పథకానికి నెల్లూరు జిల్లా కావలి వాస్తవ్యులు రసపుత్ర సుభాన్ సింగ్ కుటుంబం మంగళవారం రూ.55 వేలు విరాళంగా అందజేశారు. ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులకు అందజేసి అన్నదాన పథకానికి ఖర్చు చేయాల్సిందిగా కోరారు. అనంతరం దాత కుటుంబానికి ఆలయం మర్యాదలతో స్వామీ అమ్మవార్ల దర్శనం చేయించారు.

అవినీతి అక్రమాలకు కేరాఫ్ చంద్రబాబు:మధు

తిరుపతి(మంగళం): అవినీతి దోపిడితో రాజ్యమేలుతూ అక్రమ కేసులతో వేధించడంలో దిట్ట టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడని, వైసిపి ప్రభుత్వంపై బురదజల్లడం విడ్డూరమని వైసిపి దళిత నేత మల్లారపు మధు విమర్శలు గుప్పించారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బలహీనవర్గాలంటే గిట్టని చంద్రబాబుకు వత్తాసు పలుకుతూ ఆయన మెప్పు కోసం కనీస రాజకీయ పరిజ్ఞానం లేని అజ్ఞాని ఎమ్మెల్సీ. సుధాకర్రెడ్డి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని విమర్శించడం సిగ్గుమాలిన చర్యన్నారు. తన 45 ఏళ్ల రాజకీయ జీవితంలో మచ్చలేని నేతగా ప్రజాదరణ పొందుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్న చరిత్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిదన్నారు. ఈ కార్యక్రమంలో మల్లంగుంట సర్పంచ్ రామచంద్రయ్య, వైఎస్ఆర్ సీపీ యువజన విభాగం నేత హరిచౌహాన్ నాయక్ పాల్గొన్నారు.



నేటినుంచి ‘ సంఘం-శరణం-గచ్ఛామి’ ప్రదర్శనలు

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

నవభారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాల లక్ష్యమే సాధనంగా నిర్వహించ తలపెట్టిన ‘ సంఘం-శరణం-గచ్ఛామి’ కళారూప ప్రదర్శన 18న బుధవారం తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్ వారిచే నిర్వహిస్తున్నట్లు ప్రజానాట్యమండలి, కుల వివక్ష పోరాట సంఘం నాయకులు తెలిపారు. 19న నాయుడుపేటలో ఎల్ ఏ సాగర్ హైస్కూల్లో, 20న గూడూరులో డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్లో నిర్వహిస్తున్నామన్నారు. అంబేద్కర్ జీవితం ఆయన ఆశయాల సాధన కోసం జరపనున్న అద్భుతమైన ఈ కళారూప ప్రదర్శనను స్థానిక ప్రజానీకం ఆదరించాలని, ఈ కార్యక్రమానికి హాజరయ్యే ముఖ్య అతిథులు ఇచ్చే సందేశాలను అందిపుచ్చుకోవాలని విజ్ఞప్తి చేశారు.


కరపత్రాలు విడుదల

ప్రజాశక్తి -గూడూరు

రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జీవిత చరిత్ర “సంఘం - శరణం గచ్ఛామి” నత్య ప్రదర్శనకు సంబంధించిన కరపత్రాలను కెవిపిఎస్ పట్టణ కార్యదర్శి అడపాల ప్రసాద్ అధ్యక్షతన మంగళవారం గూడూరు సిఐటియు కార్యాలయంలో విడుదల చేశారు. అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్ వారిచే నిర్వహించే, ఈ ప్రదర్శన 20వ తేది శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియం నందు నిర్వహించనున్నారు. ఈ ప్రదర్శనకు దళిత సంఘాలు, అంబేద్కర్ అభిమానులు, ఎస్సీ, ఎస్టీ,బీసీ,మైనారిటీలు, దళిత ప్రజా సంఘాలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చాయి. ఈ కార్యక్రమంలో ఎస్. ముత్యాలయ్య, కె.శ్రీనివాసులు, జోగి శివకుమార్, పామంజి మణి, బి.గోపి, ఆర్.శ్రీనివాసులు, బివి రమణయ్య, బి.చంద్రయ్య, ఎ.చంద్రమోహన్, ఎస్.నరేష్ పాల్గొన్నారు.

డీఎస్పీని ఆహ్వానించిన నాయకులు

నాయుడుపేట : ఎల్ఏ సాగరం ఉన్నత పాఠశాలలో ఈనెల 19న జరగబోవు సంఘం శరణం గచ్ఛామి పేరుతో అంబేద్కర్ జీవిత ఆశయాలు, లక్ష్యాలపై జరిగే కార్యక్రమానికి నాయుడుపేట డిఎస్పీ ఎం. రాజగోపాల్ రెడ్డిని ప్రత్యేక అతిథులుగా ప్రజాసంఘాల నాయకులు కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు శివకవి, ముకుంద , చాపల వెంకటేశ్వర్లు, జె వి కె ఎస్ జిల్లా అధ్యక్షులు బి. గోపాల్, మహేష్ బాబు ,శ్యామలమ్మ తదితరులు పాల్గొన్నారు.


నాయుడుపేటలో...


గూడూరులో...



క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతి ప్రదానం

పుత్తూరు టౌన్ : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని. తడుకు పంచాయితీ వేణుగోపాల పురం గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ తడుకు సర్పంచ్ పాశం వెంకటేష్ (బొబ్బిలి) ఆధ్వర్యంలో నిర్వహించారు. క్రీడల్లో యువకులు ఉత్సాహంతో పాల్గొన్నారు. అనంతరం విజేతలు విన్నర్ టీమ్ నరసింహులు, రన్నర్ టీమ్ హరి, విన్నర్, రన్నర్ టీమ్స్ కి నగదు బహుమతిని పాశం వెంకటేష్ (బొబ్బిలి) చేతులు మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గోపి, లోకేష్, మధు, నవీన్, వాసు, కిషోర్ పాల్గొన్నారు.

చిట్టిబోయిన గోపి యాదవ్ ఆకస్మిక మృతి

బిఎన్ కండ్రిగ : వైఎస్ఆర్సిపి మండల మాజీ కన్వీనర్ చిట్టి బోయిన గోపి యాదవ్ ఆకస్మిక మరణం పార్టీకి తీరని లోటని, పార్టీ నాయకులు కార్యకర్తలు వాపోయారు. గోపియాదవ్ మంగళవారం ఉదయం తోట దగ్గరకు వెళ్లి తిరిగి శ్రీకాళహస్తికి వెళ్లి మందులను, పాలేరుకు భోజనం తీసుకొస్తానని చెప్పి వెళుతుండగా గుండెనొప్పి రావడంతో అలాగే ఒరిగిపోయాడు. ఎంజిఎం ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సత్యవేడు శాసనసభ్యులు కోనేటి ఆదిమూలం, కోనేటి సుమన్, మండల కన్వీనర్ ఆరణి విద్యానాథరెడ్డి, తిరుపతి ఎంపి గురుమూర్తి నివాళి అర్పించారు.



ఉర్దూ క్యాలెండర్ ఆవిష్కరణ

పుత్తూరు టౌన్ : పట్టణంలోని. పుత్తూరు తెలుగుదేశం పార్టీ. ముస్లిం మైనారిటీ. నూతన సంవత్సరం ఉర్దూ క్యాలెండర్ ను. నగరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ. ఇన్చార్జి గాలి భాను ప్రకాష్ చేతుల మీదుగా మంగళవారం గేటు పుత్తూరు వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గాలిభాను ప్రకాష్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత. రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టేసారని. నిత్యవసర వస్తువులు ఆకాశానికి అంటుతున్నాయని తెలిపారు. ముస్లీంలకు రంజాన్ తోపా ఇవ్వడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాణిజ్య పన్నుల కార్యదర్శి డిఎస్ గణేష్, రాష్ట్ర యువత మీడియా కోఆర్డినేటర్ డిజి ధనపాల్, ఖాజాపీర్ పాల్గొన్నారు.



సమస్యల పరిష్కారమే మా అజెండా : మేయర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్



నగరంలో ఏ సమస్య ఉన్నా పరిష్కరించడమే మా ధ్యేయమని మేయర్ డాక్టర్ శిరీష అన్నారు. 42 వ డివిజన్ కార్పొరేటర్ శేఖర్ రెడ్డి అభ్యర్థన మేరకు మంగళవారం తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి రామచంద్ర నగర్, ద్వారకా నగర్ ఏరియాలలో గీతాంజలి స్కూల్ వద్ద, రోడ్డు, అండర్ డ్రైనేజీ లైన్ పరిశీలించారు. మేయర్, కమిషనర్ సంయుక్తంగా పరిశీలించిన తర్వాత ఇంజనీరింగ్ అధికారులను అంచనాలు తయారు చేసి టెండర్లు పిలవాలని ఆదేశించారు. చుట్టుపక్కల అపార్ట్మెంట్లు, స్కూల్స్, హోటల్స్ ఉన్నాయని, వర్షాలు వస్తే చాలా ఇబ్బంది కలుగుతుందని, అందువల్ల సి.సి డ్రైన్, భూగర్భ అండర్ డ్రైనేజ్ లైన్, రోడ్డు సౌకర్యం కల్పించాలని మేయర్, కమిషనర్‌లకు వార్డు కార్పొరేటర్ ఇబ్బందులు తెలిపారు. త్వరలో టెండర్లు పిలిచి పని ప్రారంభిస్తామని తెలిపారు. ఎస్ఇ మోహన్, ఎంఇ వెంకటరామిరెడ్డి, ఆరోగ్యాధికారి హరికష్ణ, డి.ఈ. విజయ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఎస్వీయూ సెనెట్ హాలులో ‘కౌన్సిల్’ సమావేశం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం జనవరి 18న బుధవారం ఉదయం 11 గంటలకు ప్రారంభం కానుంది. తిరుపతి ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి ప్రత్యేక ఆహ్వానితులుగా మేయర్ డాక్టర్ శిరీష అధ్యక్షతన జరగనుంది. కమిషనర్ అనుపమ అంజలి అజెండాను ప్రవేశపెట్టనున్నారు. డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్‌రెడ్డి, ముద్రనారాయణ, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు అజెండాపై చర్చించనున్నారు. ఎస్వీయూ సెనెట్‌హాలులో కౌన్సిల్ సమావేశం జరగనుంది.

ఘనంగా గోపూజ

పుత్తూరు టౌన్ : పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర ఆలయమునందు సోమవారం గోపూజ నిర్వహించారు. ఉభయదారులుగా పుత్తూరు పట్టణంలోనే రామానాయుడు కాలనీ చెందిన శివాలయ మాజీ చైర్మన్, బలిజ అభ్యుదయ సేవ సంఘం బలిజ అభ్యుదయ సేవా సంఘ అధ్యక్షుడు, సునీల్ కుమార్ ,సాయి గీత దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ గురుకుల మురళి పాల్గొన్నారు.

వైద్యుల రక్షణ చట్టం అమలు చేయాలి



ప్రజాశక్తి - తిరుపతి సిటి

వైద్యులపై దాడులు జరగకుండా రక్షణ కొరకు దేశవ్యాప్తంగా వైద్యుల రక్షణ చట్టం అమలు చేయాలని ఐఎంఎ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు, తిరుపతి శాఖ ఉపాధ్యక్షులు డాక్టర్ యుగంధర్, రాష్ట్ర నాయకులు వాసుదేవనాయుడు, డాక్టర్ సుధాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతీ ప్రవీణ్‌పవర్‌ను కలిసారు. డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు వైద్యుల రక్షణ కోసం దేశంలోనే మొట్టమొదటిసారిగా ఆంధ్రప్రదేశ్ వైద్యుల రక్షణ చట్టాన్ని తీసుకొచ్చి అమలు చేశారన్నారు. అనంతరం దేశవ్యాప్తంగా అమలు చేశారని గుర్తు చేశారు. ఇందులో దోషులకు మూడు సంవత్సరాలు శిక్ష, నాన్‌బెయిలబుల్ అమల్లో ఉండేదన్నారు. ఆస్పత్రులను సురక్షిత ప్రాంతంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలా లేకుంటే వైద్యులు అత్యవసర కేసులు, ప్రాణాపాయ కేసులు తీసుకునేందుకు భయపడతారన్నారు.

‘వాసవీ క్లబ్’ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-సూళ్లూరుపేట



సంక్రాంతి సందర్భంగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వారి క్యాలెండర్ ఆఫ్ ఈవెంట్స్ లో భాగంగా సూళ్లూరుపేట వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు(రంగోళి)సాయినగర్ సాయిబాబా గుడి ప్రాంగణంలో నిర్వహించారు. పిల్లలకు గాలి పటాల పోటీ నిర్వహించారు. సహకరించిన సాయిబాబా గుడి వ్యవస్థాపకులు బాలయ్యకు ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. న్యాయ నిర్ణేతలుగా ఐతా సుభాషిణి, మురిగిపూడి పద్మజ వ్యవహరించినారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇంటర్నేషనల్ డైరెక్టర్ సిల్వర్ స్టార్ కేసీజీఫ్ బండారు శబరీష్ గుప్తా విచ్చేశారు.ఈ కార్యక్రమములో వనిత క్లబ్ ప్రెసిడెంట్ సునీత, కార్యదర్శి కళావతి, కోశాధికారి శైలజ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో ఐతా మాధవి, కోట లోకేశ్వరి, రావూరి నాగ సజన మొదటి మూడు ప్రైజు లను గెలుచుకున్నారు. పద్మ, శిరీష, జమున, శిల్ప, రాణి, నిర్మల, ప్రియ, మోక్షిత, విజయలక్ష్మి మొదలగువారు పార్టిసిపేంట్స్ ప్రైజెస్‌ను తీసుకున్నారు.

గోదాదేవి కళ్యాణం

ప్రజాశక్తి- సూళ్లూరుపేట

సూళ్లూరుపేటలో వెలసి ఉన్న మధ్వెంకట రామమూర్తి ఆలయం లో ధనుర్మాసం సందర్భముగా సంక్రాతి పండుగను పురస్కరించుకొని గోదాదేవి కళ్యాణంను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ఆవరణంలో సోమవారం శ్రీ రంగనాధునితో గోదాదేవిని కొలువుతీర్చి శాస్త్రోక్తంగా కళ్యాణం జరిపించారు. ఉభయదాతలు మోదుగుల విజయకుమార్ దంపతులతో పాటు మరి కొంతమంది ఉభయదాతలు పాల్గొన్నారు.


ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో చీరలు పంపిణీ

గూడూరు రూరల్: ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం గూడూరు లోని బాలాజీ నగర్ లోని ప్రగతి ఆఫీస్ నందు కీర్తిశేషులు ఆర్ముగం 20వ వర్ధంతి సందర్భంగా వారి కుమారుడు రమేష్ బేకరి అధినేత రమేష్ సహాయ సహకారాలతో 60 మంది మహిళలకు చీరలను, చికెన్ బిర్యానీని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, సెక్రటరీ చంద్రశేఖర్, ట్రెజరర్ కాటూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.



ఏపీఎస్ఆర్టీసీకి లాభాల పండుగ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో



సంక్రాంతికి ముందు రోజుల్లో జనవరి 6 నుండి 14 వరకు ఏపీఎస్ ఆర్టీసీ రికార్డు స్థాయిలో 3,392 ప్రత్యేక బస్సులు నడిపింది. సంక్రాంతికి ముందు రోజుల్లో 3120 ప్రత్యేక బస్సులను నడపాలని యోచిస్తున్నట్లు ఎపీఎస్ఆర్‌టిసి ప్రకటన విడుదల చేసింది. సాధారణ ఛార్జీలకే తగిన సంఖ్యలో ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉన్నందున ఏపీ, తెలంగాణ, తదితర ప్రాంతాల ప్రజలు ప్రైవేట్ బస్సుల కంటే, ఏపీఎస్ఆర్టీసీ బస్సులకే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారు. తిరుగు ప్రయాణ టిక్కెట్ ఛార్జీపై 10శాతం రాయితీ సౌకర్యం కూడా ప్రయాణికులను ఏపీఎస్ వైపు ఆకర్షించేలా చేసింది. గత సంవత్సరం ఏపీఎస్ సంక్రాంతి ముందు రోజుల్లో 2,400 ప్రత్యేక బస్సులను మాత్రమే నడిపింది. సంక్రాంతి ప్రత్యేక బస్సులకు ‘సాధారణ ఛార్జీలు’ వసూలు చేయడం వల్ల ప్రయాణికులు ఇతర వాహనాలను ఆశ్రయించకుండా ఏ.పి.ఎస్.ఆర్.టి.సి. బస్సులకే ఎక్కువ మొగ్గు చూపారు. దీని ఫలితంగా స్థూల ఆదాయం బాగా పెరిగింది. గత సంవత్సరం సాధించిన ఆదాయం రూ . 7.17 కోట్లుతో పోలిస్తే, ఈ సంవత్సరం 50% అదనపు ఛార్జీలు లేకుండానే అదనంగా రూ. 7.90 కోట్ల ఆదాయం ఆర్జించడం జరిగింది. కాగ, గత ఏడాది ఇవే రోజుల్లో సాధించిన రూ.107 కోట్ల ఆదాయం కంటే ఈ సంవత్సరం రూ. 141 కోట్ల ఆదాయం ఏపీఎస్ ఆర్టీసీ సాధించగలిగిందని ఏపీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమల రావు వెల్లడించారు.

గత ఏడాది హైదరాబాదు నుండి ఆంధ్రప్రదేశ్ లోని వివిధ ప్రాంతాలకు 824 బస్సులు నడపగా, ఈ సంవత్సరం 1,483 ప్రత్యేక బస్సులను నడిపింది. హైదరాబాద్లో సరైన మౌలిక సదుపాయాలు లేనప్పటికీ పెద్ద ఎత్తున బస్సులు నడిపి, ప్రయాణికుల నుండి ఎటువంటి ఫిర్యాదులు లేకుండా ప్రత్యేక సర్వీసులను నిర్వహించగలిగింది. కాగా ముఖ్యంగా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ఇతర అంత్రరాష్ట్రాలకు వెళ్లే తిరుగు ప్రయాణికుల కోసం రద్దీని బట్టి ముందస్తు సీట్ల రిజర్వేషన్ కల్పిస్తూ, బస్సులు నిరంతరం అందుబాటులో ఉంచడం జరిగింది. సంక్రాంతి ముందు రోజుల్లో ఏపీఎస్ ఆర్టీసీ సేవలను విశేషంగా ఆదరించినందుకు ప్రయాణికులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ అంతటా అన్ని ప్రదేశాల నుండి తగిన సంఖ్యలో తిరుగు ప్రయాణం కోసం ఏపీఎస్ఆర్టీసీ బస్సులను సిద్ధం చేసినందున ఏపీఎస్ ఆర్టీసీ బస్సులను ఆదరించి సేవలను పొందడం కొనసాగించాలని ప్రయాణికులకు విజ్ఞప్తి చేస్తున్నామని పేర్కొన్నారు.